ప్రతిభతోనే క్రీడాకారులకు గుర్తింపు సాధ్యం



దెందులూరు: గోపన్నపాలెంలో వాలీబాల్ ఆడుతున్న ట్రైనీ కలెక్టర్ భానుశ్రీ



గణపవరం: నియోజకవర్గ స్థాయి పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులురాజు

దెందులూరు: ఏ రంగంలోనైనా ప్రతిభతోనే గుర్తింపు లభిస్తుందని ట్రైనీ కలెక్టర్ భానుశ్రీ అన్నారు. బుధవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో దెందులూరు నియోజకవర్గ 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను ఎంపీడీఓ భీమరాజు, కో ఆర్డినేటర్, ఫిజికల్ డైరెక్టర్ రాజ్‌గోపాల్ ఆధ్వర్యాన ప్రారంభించారు. తొలుత ట్రైనీ కలెక్టర్ భానుశ్రీ,, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి క్రీడా, జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. నియోజకవర్గ స్థాయి పోటీలకు విచ్చేసిన 40 జట్ల పురుషులు, మహిళా క్రీడాకారులకు ట్రైనీ కలెక్టర్, సర్పంచ్, ఎంపీడీఓ స్వాగతం పలికారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, కోర్టులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నత్తాని యేలు, ట్రైనీ కలెక్టర్, సర్పంచ్ ప్రారంభించారు. ట్రైనీ కలెక్టర్ వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్, ఆడుదాం ఆంధ్ర అంబాసిడర్ సౌజన్య, తహశీల్దార్ నాంచారయ్య, మండల కో ఆర్డినేటర్ జక్కుల సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు రాధ, మార్గాని మల్లికార్జునరావు, జమ్ము రామకృష్ణ, విజయరాజు, షేక్ రఫీ, వ్యాయామ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మోర్ల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు వీరంకి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

గణపవరం: క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని, గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహిస్తే, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసుకునే అవకాశం ఉంటుందని భీమవరం ఆర్డీవో శ్రీనివాసులు రాజు అన్నారు. బుధవారం గణపవరం డిగ్రీ కాలేజ్ ఆవరణలో ఉంగుటూరు నియోజకవర్గస్థాయి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఖోఖో, వాలీబాల్ క్రీడలకు సంబంధించి నాలుగు మండలాల నుంచి మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. క్రీడాకారులను ఆర్డీవో పరిచయం చేసుకుని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, మండల ఉపాధ్యక్షురాలు సలాది దుర్గా రత్నకుమారి, ఎంపీడీవో జ్యోతిర్మయి, గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు తహశీల్దార్‌లు పమ్మి లక్ష్మి, అల్లాడి రమణ, సాయిరాజు, సర్పంచ్ మూర అలంకారం, వైఎస్సార్ సీపీ నాయకులు దండు రాము, కాకర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగనన్న కాలనీలో రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు



సానిగూడెం జగనన్న కాలనీలో కల్పించిన రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు

దెందులూరు: సానిగూడెం గ్రామంలో జగనన్న కాలనీకి రోడ్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు) తెలిపారు. జగనన్న కాలనీవాసుల జీవన విధానం, సౌకర్యాలు మెరుగ్గా ఉండేందుకు వెంటనే రోడ్లు, స్థంబాలు, కుళాయిలు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గ్రామస్తుల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మాధవరావుకు నివాళులర్పించిన ఎమ్మెల్యే



రాట్నాలకుంటలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

పెదవేగి: మంచితనానికి మారుపేరైన కొత్తపల్లి మాధవరావు మామ లేని లోటు తీరనిదని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మండలంలోని రాట్నాలకుంట గ్రామానికి చెందిన మాధవరావు స్వయాన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి బావకి తండ్రి, కొఠారు రామచంద్రరావుకు వియ్యంకుడు కాగా, మాధవరావు బుధవారం మరణించారు. ఆయన భౌతికకాయానికి ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హోటల్‌పై విజిలెన్స్ అధికారుల దాడి



గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ సీఐ యుజే విల్సన్, సీఎస్‌డీటీ ఎ.మాధవరావు

భీమడోలు: భీమడోలు జంక్షన్‌లో ఓ హోటల్‌పై బుధవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడి చేశారు. హోటల్‌లో 5 సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. హోటల్ యాజమాని ఎస్.శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశారు. హోటల్‌లో వాణిజ్య అవసరాలకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నట్లుగా సమాచారం అందుకున్న విజిలెన్స్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ యుజే విల్సన్ ఆధ్వర్యాన సిబ్బంది తనిఖీలు చేశారు. హోటల్‌లో వినియోగిస్తున్న రూ.12,844లు విలువ చేసే 5 సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. యజమానిపై నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. తనిఖీల్లో భీమడోలు సీఎస్‌డీటీ ఎ.మాధవరావు, వీఆర్వో సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

నేడు భీమడోలులో క్రికెట్ మ్యాచ్

భీమడోలు: భీమడోలులో బుధవారం కురిసిన భారీ వర్షం కారణంగా క్రికెట్ మ్యాచ్ ఈనెల 25వ తేదీ గురువారానికి వాయిదా వేసినట్లు మండల కో ఆర్డినేటర్ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గ స్థాయిలో 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో భాగంగా జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు వేదికగా ఉన్నతాధికారులు నిర్ణయించారు. అయితే బుధవారం మధ్యాహ్నం భీమడోలు, నిడమర్రు టీమ్‌లకు క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తుండగా ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో గ్రౌండ్ తడిసింది. దీంతో మ్యాచ్‌ను ఉన్నతాధికారుల సూచనల మేరకు గురువారానికి వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

డిఫెన్స్ మద్యం పట్టివేత



సీఐ కార్యాలయంలో పట్టుకున్న మద్యం బాటిళ్లతో సీఐ గిరిజ సత్యకుమారి, సిబ్బంది

భీమడోలు: ఎస్‌ఈబీ తనిఖీల్లో డిఫెన్స్ మద్యం బాటిళ్లను కలిగి ఉన్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు భీమడోలు ఎస్‌ఈబీ సీఐ పి.గిరిజ చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురం వద్ద బుధవారం ఎస్ఈబీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. నల్లజర్ల మండలం గంటవారిగూడెంకు చెందిన ఆలపాటి శేఖర్ లక్ష్మీపురంలో టీ దుకాణం నడుపుతున్నాడు. ఈ క్రమంలో అధికారులు శేఖర్ వద్ద డిఫెన్స్‌కు చెందిన టీచర్స్, రాయల్స్ రాన్‌తంబోర్ బ్రాందీ ఫుల్ బాటిళ్లు ఉండటాన్ని గమనించి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై వెంకటలక్ష్మీ, హెడ్ కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నిర్మూలన



గణపవరంలో మహిళకు అంటువ్యాధులపై కరపత్రం అందజేస్తున్న మలేరియా అధికారి

గణపవరం: అన్ని వ్యాధులకు మూల కారణం దోమలని, పరిసరాల పరిశుభ్రతతో వీటిని నిర్మూలించవచ్చని తాడేపల్లిగూడెం మలేరియా అధికారి వై.లక్ష్మణరావు తెలిపారు. బుధవారం గణపవరం 1, 3 సచివాలయాల పరిధిలో అంటువ్యాధుల వ్యాప్తి, దోమల నిర్మూలన, అపరిశుభ్రతపై నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని, ఈ విషయంలో ఎవరూ నిర్లక్ష్యం చూపరాదన్నారు. దోమల నిర్మూలన ముఖ్యమని, ఇంటి పరిసరాలలో మురుగునీటి నిల్వల లేకుండా చూసుకోవాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి వ్యాధుల వ్యాప్తి కారణాలు, నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించి, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2,850 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి
- పెదపాడులో ప్రజా ఆశీర్వాద యాత్ర



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: దెందులూరు నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో రూ.2,850 కోట్ల సంక్షేమం, అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తెలిపారు. బుధవారం పెదపాడులో ప్రజా ఆశీర్వాద యాత్రను జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయాణం పేదలతోనే అని, పేదవారికి, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న యుద్ధంగా అభివర్ణించారు. పేదల పక్షాన నిలబడతామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి పథకాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. మరలా మాయ మాటలు చెప్పేందుకు చంద్రబాబు మీ ముందుకు వస్తారని అలాంటి వారిని నమ్మవద్దన్నారు. నియోజకవర్గంలో గుడ్ మార్నింగ్ దెందులూరు, గడపగడప కార్యక్రమం, ప్రజా ఆశీర్వాద యాత్ర చేపట్టామన్నారు. వీటి ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని ముఖ్యమంత్రి దృష్టిలో పెట్టి వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. ఈనెల 30వ తేదీన దెందులూరులో జరిగే ముఖ్యమంత్రి సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. పెదపాడు మండలంలో పెదపాడు - పెరికీడు రహదారికి రూ.55 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కొంతకాలం అలస్యమైన పూర్తిస్థాయిలో నిర్మాణం చేపడ్తామన్నారు. వడ్డిగూడెం- గుడిపాడు- పెదపాడు రహదారి, పెదపాడు -నాయుడుగూడెం-సత్యవోలు మీదుగా కొణికి రహదారి నిర్మాణం చేసినట్లు చెప్పారు. కొత్తూరు నుంచి వీరమ్మకుంట మీదుగా పెదపాడుకు రహదారి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గ్రామంలో రూ.2 కోట్లతో సీసీ రహదార్లు వేసినట్లు తెలిపారు. మీరు మంచివైపు ఉంటారని ఆశిస్తున్నామన్నారు. శ్మశానానికి వెళ్లే రహదారిని మంజూరు చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మీ కుటుంబానికి మంచి జరిగితేనే ఓటు వేయమని అడిగిన ఏకైక వ్యక్తి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ కుమార్, పెదపాడు సర్పంచ్ కొత్తూరి జీవనకుమారి, సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు, పార్టీ నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తేరా ఆనంద్, పెదపాడు, గోగుంట సొసైటీ అధ్యక్షులు అక్కినేని రాజశేఖర్, భావరాజు సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణ కుమారి, ఎంపీటీసీ కర్రె మరియమ్మ, సీనియర్ నాయకుడు గారపాటి భాస్కరరావు, అక్కినేని లక్ష్మీ నారాయణ, పెనుమత్స శ్రీనివాసరాజు, కాలి మిరియమ్మ, దేవరపు కుమార్, ఉప సర్పంచ్ చేపేని కృష్ణ, కొత్తూరు విమలారావు, రెళ్ల రమణ, సంగాపు తిరుపతిరావు, గోకా శంకరరావు, గుణుపూరు మహేష్, వట్రపు కోటిరెడ్డి, మెడబలిమి సంతోష్‌కుమార్. సంబంగి శ్రావణ్‌కుమార్, మరీదు రెడ్డియ్య, చోడగిరి రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు కైకరంలో ఆసరా చెక్కుల పంపిణీ

ఉంగుటూరు: కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు 2,700 మంది డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం చెక్కులు పంపిణీ చేయనున్నట్లు ఏపీవో పద్మావతి తెలిపారు. ఎమ్మెల్యే వాసుబాబు ముఖ్యఅతిథిగా హాజరై చెక్కులు అందజేస్తారని చెప్పారు. ఎ.గోకవరం గ్రామానికి సంబంధించి 66 స్వయం సహాయక సంఘాల్లోని 667 మందికి రూ.93.76 లక్షలు, కైకరం గ్రామానికి చెందిన 206 గ్రూపుల్లోని 2,035 మందికి రూ.2కోట్ల 36 లక్షల 50వేల 763లు పంపిణీ చేయనున్నట్లు పద్మావతి వివరించారు.

వైఎస్సార్ సీపీ సమావేశం

కైకరం హైస్కూల్ ఎదురుగా ఉన్న కళ్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం గురువారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

దెందులూరు: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఉదయం 10 గంటలకు గారపాటి హైమావతి దేవి పాఠశాలలో ఈఆర్ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యాన నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య తెలిపారు. ఓటర్ల పండుగ సందర్భంగా విద్యార్థులు, బూత్ లెవెల్ అధికారులు ఓటర్లతో భారీ ర్యాలీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఉదయం 10 గంటలకు దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల్లో 239 పోలింగ్ బూత్‌ల్లో ఓటర్ల ప్రతిజ్ఞ, ముగ్గుల పోటీలు, సీనియర్ ఓటర్లు, దివ్యాంగుల ఓటర్లు, మహిళా ఓటర్లకు సన్మానం, కొత్త ఓటర్లకు కొత్త కార్డుల పంపిణీ చేయనున్నారు. మండల స్థాయిలో ముగ్గుల పోటీలు, విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు.

పేదలకు ఇళ్లు వైసీపీ ప్రభుత్వంలోనే సాధ్యం



ఉంగుటూరులో ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: పేదల ఇళ్ల సాకారం ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమవుతోందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఉంగుటూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 39 మంది లబ్ధిదారులకు బుధవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ పేదలకు ఒక ఇంటి స్థలం కూడా చంద్రబాబు ఇవ్వలేకపోయారని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక నిరుపేదలకు ఒక ఉద్యమంలా ఇళ్ల స్థలాలను రాష్ట్రంలో అందజేశారన్నారు. తహసీల్దారు వెంకటరమణ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఉంగుటూరులో 16 మందికి, నాచుగుంటలో 7గురికి, నల్లమాడులో ఒకరికి, నీలాద్రిపురంలో ఒకరికి, ఉప్పాకపాడులో 5గురికి, కంసాలిగుంటలో ఇద్దరికి, వీపీ పురంలో 7గురికి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, సచివాలయాల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, మహిళా నాయకురాలు మంద జయలక్ష్మి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌లో బాధితులను రక్షిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

పెదవేగి: పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, సిబ్బంది ప్రమాదాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఏలూరు ఆర్డీవో ఖాజావలీ సూచించారు. పెదవేగి మండలం నడిపల్లిలోని ప్రసాద్ సీడ్స్ కర్మాగారంలో బుధవారం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసు, రవాణా, ఆరోగ్య, పరిశ్రమల శాఖల సంయుక్త ఆధ్వర్యా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎల్పీజీ గ్యాస్ లీకేజీల వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులు స్పందించాల్సిన తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా పరిశ్రమల శాఖ ఉప ముఖ్యఅధికారి ఆర్.త్రినాధరావు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం మంగళగిరి బెటాలియన్ కమాండెంట్ కృష్ణవతారం వివరించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణ, పర్యావరణశాఖ ఈఈ కె.వెంకటేశ్వరరావు, నడిపల్లి సర్పంచ్ మేకా అప్పాయమ్మ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు కోదండరామాలయంలో లలితా పారాయణం

దెందులూరు: మండలంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ కోదండరామాలయంలో 80 జంటలతో లలితా సహస్రనామ పారాయణం గురువారం నిర్వహించనున్నట్లు లలితా పారాయణం కమిటీ ప్రతినిధి బెజవాడ పద్మ తెలిపారు. ఉదయం 9 గంటలకు హిందూ సంస్కృతి పరిరక్షణ, అవగాహన, సంస్కృతీ సాంప్రదాయాలను పెంపొందించేందుకు శ్రీ కోదండ రామాలయం లలితా పారాయణ కమిటీ తమ వంతు సేవలందిస్తోందని ఆమె చెప్పారు. భక్తులు లలితా పారాయణంలో పాల్గొనాలన్నారు.

భీమడోలు సర్పంచ్‌కు కలెక్టర్ సన్మానం



సర్పంచ్ సునీతా మాన్‌సింగ్‌ను సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

భీమడోలు: జాతీయ స్థాయి సదస్సులో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్న భీమడోలు గ్రామ పంచాయతీని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అభినందించారు. ఏలూరులో బుధవారం ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై జరిగిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో జాతీయ స్థాయిలో ఉత్తమ సేవలందించి ప్రత్యేక గుర్తింపు పొందిన సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్‌ను కలెక్టర్ దుశ్శాలువాతో సత్కరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలను గ్రామస్థాయిలో సమర్థవంతంగా నిర్వహిస్తున్న సర్పంచ్, గ్రామ కార్యదర్శి ఎన్.ఠాగూర్ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. జాతీయ స్థాయిలో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులంతా తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, సీఈవో సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికాభ్యున్నతికి సహకరించాలి

గణపవరం: బాలికల పట్ల సమభావన కలిగి ఉండాలని, బాలికాభ్యున్నతికి అందరూ సహకరించాలని అప్పుడే సమాజం పురోగతిలో పయనిస్తుందని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలి కా దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన నిర్వహించిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికలంతా విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. బాల్య వివాహా లు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరాదని, ఇది చట్టరీత్యా నేరమని అన్నారు. అన్నిరంగాలలో మహిళలు రాణిస్తున్నారని, ఈ కార్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రతి మహిళా ప్రతిన బూనాలన్నారు. పలువురు మహిళా విద్య ప్రాముఖ్యతను వివరించారు. గణపవరం బాలికోన్నత పాఠశాల, పిప్పర, కాశిపాడు ఉన్నత పాఠశాలల్లో బాలికా దినోత్సవం నిర్వహించారు. గణపవరం జూనియర్ కాలేజ్‌లో విద్యార్థినులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

16 నుంచి అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు



ప్రత్యేకాలంకరణలో శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ



దాత నిర్మించిన రోడ్డు

దెందులూరు: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి గాంచిన గాలాయగూడెం గ్రామ దేవత శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయ 67వ వార్షిక మహోత్సవాలను ఫిబ్రవరి 16 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 25న భారీ అన్నదానం ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమవుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయానికి రోడ్డు నిర్మాణం

దెందులూరు: మండలంలోని గాలాయగూడెం శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి అమ్మవారి ఆలయానికి జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డులో వీఆర్ఓ. విష్ణు ఇంటి వద్ద నుంచి నేరుగా గుడికి వెళ్ళేందుకు అర కిలో మీటరు రోడ్డు నిర్మాణం పూర్తయింది. గ్రామానికి చెందిన మణికంఠ కన్‌స్ట్రక్షన్ అధినేత గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతులు రూ.25 లక్షలతో అమ్మవారి ఆలయాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు విరాళంఇచ్చారు. ఈ నిధులతో ప్రతి ఏటా భక్తులు అమ్మవారి ఆలయానికి చేరేందుకు రోడ్డును నిర్మించడం పట్ల గ్రామ సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, ఆలయ కమిటీ దాతలను అభినందించి సత్కరించారు. కాగా ఇంతకు ముందు రూ.50 లక్షలతో ఆలయాభివృద్ధికి కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతులు దాతృత్వం చాటుకున్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి

పెదవేగి : విద్యార్థుల అభ్యున్నతికి వారి తల్లిదండ్రుల కంటే ఎక్కువగా ఆలోచిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని విజయరాయి సర్పంచ్ గొట్టాపు కృష్ణవేణి అన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఆమె పంపిణీ చేశారు. హెచ్ఎం వెంకటరమణ అధ్యక్షత వహించగా, విద్యా కమిటీ చైర్మన్ రంగారావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లీగల్ శివరామకృష్ణ, ఎంపీటీసీ వసంత లక్ష్మి, మంతెన కిషోర్ పాల్గొన్నారు.

భీమడోలు ఎస్ఈబీ సీఐగా గిరిజ సత్యకుమారి



సీఐ పి.గిరిజ సత్యకుమారి

భీమడోలు: భీమడోలు ఎస్ఈబీ సీఐగా పి.గిరిజ సత్యకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆమె మైలవరం నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. అలాగే భీమడోలు ఎస్ఈబీ ఎస్సైగా జి.వెంకటలక్ష్మి కూడా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సీఐ సుబ్రహ్మణ్యం తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం బదిలీ అయ్యారు. సీఐ గిరిజ సత్యకుమారి మాట్లాడుతూ భీమడోలు సర్కిల్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లోని గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పరిశుద్ధ నిత్య సహాయ మాత మహోత్సవాలు

దెందులూరు: పోతునూరులో బుధవారం పరిశుద్ధ నిత్య సహాయ మాత మహోత్సవాలు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పరిసే డేవిడ్ ఆధ్వర్యాన జరిగాయి. లక్కవరం ఫాదర్ నత్తా జోసెఫ్, బొర్రంపాలెం ఫాదర్ బీవీ ప్రసాద్, సహాయక గురువులు మందపాటి రాజు, నిట్టా రాజేష్, పోతునూరు ఆర్‌సీఎం సంఘ పెద్దలు, సంఘస్తులు, మరియదళ సభ్యులు, యువత పరిశుద్ధ నిత్య సహాయ మాత విగ్రహంతో గ్రామోత్సవం, అన్ని వీధుల మీదుగా నిర్వహించారు.

ఫాదర్ దల్లెబ్బీ జయంతి

తొలుత పోతునూరులో సేవలందించిన ఫాదర్ దల్లెబ్బీ జయంతి ఉత్సవాలు జరిగాయి. తొలుత కేక్ కట్ చేశారు. అనంతరం ఫాదర్లు దివ్య పూజాబలి అర్పించారు.

దాడికి పాల్పడిన ఇద్దరు యువకులపై కేసు

భీమడోలు: మహిళపై దాడి చేసి డబ్బులు లాక్కొని పరారైన ఇద్దరు వ్యక్తులపై భీమడోలు పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. భీమడోలులోని ఇందిరా కాలనీ చెందిన కాసం యామిని అనే మహిళ కారు డ్రైవింగ్ నేర్చుకునేందుకు తన డ్రైవర్‌తో కలిసి మంగళవారం గ్రామ శివారులోని ప్లాట్స్‌కి వెళ్లింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన పాత నేరస్తులు మద్దా కల్యాణ్, నూకల ప్రవీణ్ అనే ఇద్దరు వ్యక్తులు కారు వద్దకు వెళ్లి ఆమెను డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. ఆమె ససేమిరా అనడంతో ఆగ్రహంతో కారు అద్దాలను పగులకొట్టారు. దాడి చేసి ఆమెతో పాటు కారు డ్రైవర్‌ను గాయపర్చారు. ఆమె వద్ద గల రూ.3వేల నగదును దోచుకుని పరారయ్యారు. బాధితురాలు యామిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సీనియర్ ఓటర్లకు సన్మానం

ఏలూరు (మెట్రో): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. యువ ఓటర్లకు గుర్తింపు కార్డుల ప్రదానం, సీనియర్ ఓటర్లకు, విభిన్న ప్రతిభావంతుల ఓటర్లను సన్మానిస్తారని పేర్కొన్నారు.